
అడుగంటిన భూగర్భ జలాలు


నకిరేకల్ మండలం ఓగోడులో నీరు లేక వెలవెలబోతున్న చెరువు


నకిరేకల్ మండలం కడపర్తి గ్రామంలో ఎండిపోయిన బావి


మంగళపల్లి గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలు

- చెరువులు, కుంటలు వెలవెల
- ఎండుతున్న పంట పొలాలు
- ఆందోళనలో అన్నదాత

నకిరేకల్ : చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేకపోవడంతో ఆయకట్టు రైతుల బతుకులు బండబారుతున్నాయి. గత సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వేసవి కాలం ముందే భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. పలు గ్రామాల్లో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు 200–250 ఫీట్ల వరకు బోర్లు వేసే ప్రయత్నం చేసినా చుక్క నీరు రాకపోవడంతో కుదేలైపోతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో తాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాల్లో చెరువులు, కుంటల్లో నీరు అడుగంటి పోయింది. దీంతో ఆయకట్టు సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. నకిరేకల్ నియోజకవర్గంలో 83 చెరువులు, 211 కుంటలున్నాయి. వీటికింది సుమారు 13,944 ఎకరాల్లో ఆయకట్టు ఉంది. వర్షాభావ పరిస్థితులతో చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో బోర్లపైనే ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. నకిరేకల్, కేతేపల్లి మండలాల్లోని ప్రధాన చెరువుల్లోకి ఏఎమ్మార్పీ కాలువల ద్వారా రెండేళ్లుగా నీరు రాకపోవడంతో కొన్ని చెరువులు, కుంటలు నీరు లేక బోసిపోతున్నాయి.

నకిరేకల్ నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు వాటి కింద సాగు విస్తీర్ణం

మండలం	చెరువులు	కుంటలు	విస్తీర్ణం (ఎకరాల్లో)
నకిరేకల్	13	84	2200
కేతేపల్లి	17	15	3200
కట్టంగూర్	13	40	3500
నార్కట్‌పల్లి	10	30	1100
చిట్యాల	10	12	1500
రామన్నపేట	20	30	2444
మొత్తం	83	211	13,944

ఎండిపోతున్న పంట పొలాలు

చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో భూగర్భ జలాల అడుగంటి బోర్లల్లో నీరు తగ్గుముఖం పట్టింది. దీంతో నకిరేకల్ మండలంలోని మంగళపల్లి, ఓగోడు, కడపర్తి, నెల్లిబండ, చందంపల్లి, నర్సింహాపురం, మర్రూరు తదితర గ్రామాల్లో వరి పొలాలు ఎండిపోతున్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 300 ఎకరాల వరి పొలాలను రైతులు వదిలి వేయడంతో వరిని పశువులు మేస్తున్నాయి.

బోర్లలో నీరు తగ్గింది



మా గ్రామంలోని పెద్ద చెరువులో ఈఏడాది ఎండ కాలం రాకముందే చుక్క నీరు లేకుండా అడుగంటి పోయింది. దీంతో బోర్లలో నీరు రావడం తగ్గింది. ఫలితంగా గ్రామంలో వరి సాగుచేసిన ఒక్కో రైతు అర ఎకరం చొప్పున వరి చేలు వదిలేశారు. మార్చి నెల వస్తే ఎండలకు పంటపొలాలు పూర్తిగా ఎండిపోయే అవకాశం ఉంది. మేం కూడా 5 ఎకరాలకు అర ఎకరం పైనే నీరు లేక వదిలేశాం.

–కురెంద కృష్ణ, రైతు, ఓగోడు, నకిరేకల్ మండలం

అంగడి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి


వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని కూరగాయల అంగడి స్థలం విషయంలో కోర్టు తీర్పును గౌరవిస్తూ అంగడి స్థలాన్ని గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం నకిరేకల్ నియోజకవర్గంలో విజయ సంకల్ప యాత్రలో భాగంగా వెంకటరమణారెడ్డి నార్కట్‌పల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి సభ్యులు కూరగాయల అంగడీ స్థలం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని కోరుతూ ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గ్రామ కంఠం భూమిని అక్రమార్కులు కాజేయాలని చూడగా గ్రామస్తులు అడ్డుకుంటే వారికి మతం రంగు పూసి క్రిమినల్ కేసులు పెట్టి బెదిరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అంగడి స్థలం సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి


బహుమతులు అందజేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదవి ఉన్నత స్థాయికి చేరుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన కళాశాల 15 వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ లక్ష్యం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. కళాశాల ఆడిటోరియం కోసం రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం గత సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, పూజర్ల శంభయ్య, పన్నాల రాఘవరెడ్డి, గద్దం స్వామి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బెల్టు షాపుల నిర్మూలన కమిటీ నియామకం

చండూరు: మండలంలోని తాస్కానిగూడెం, బోడంగిపర్తి గ్రామాల్లో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సుజాఉద్దీన్, మాజీ సర్పంచ్ అబ్బనబోయిన లింగయ్య ఆధ్వర్యంలో 10 మంది మహిళలు, 10 మంది పురుషులతో కలిపి బెల్ట్ షాపుల నిర్మూలన కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బంగారిగడ్డ ఎంపీటీసీ పల్లె వెంకన్న, కాంగ్రెస్ నాయకులు గంట సత్యం, కోరిమి ఓంకారం, సాపిడి రాములు, తోటకూరి వెంకన్న, పోలు వెంకట్‌రెడ్డి, ఇరిగి రాజు, బొడంగిపర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు ఇద్దయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

చైల్డ్‌కేర్ సెంటర్‌కు వితరణ


మంచాలను స్వాధీనం చేస్తున్నట్లు పత్రం అందజేస్తున్న కిశోర్

నల్లగొండ టౌన్: పట్టణంలోని చారుమతి చైల్డ్ కేర్ సెంటర్‌లో గల అనాథ బాలికల సౌకర్యార్థం చౌటుప్పల్‌లోని దివీస్ కంపెనీవారు గురువారం నాలుగు లక్షల రూపాయల విలువ చేసే మంచాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సీఎస్ఆర్ విభాగం అధికారి కిశోర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కంపెనీ నుంచి రూ.40 కోట్లకు తగ్గకుండా సామాజిక సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు శ్యామల నాగసేనారెడ్డి, అధ్యక్షుడు డి.నాగబ్రహ్మం, మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

రామగిరి(నల్లగొండ): పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్తున్న తిప్పర్తి మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను గురువారం పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. కంకణాలపల్లి, రాజుపేట, పజ్జూరుకు చెందిన మాజీ సర్పంచ్‌లతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.
మర్రిగూడ: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాకు తరలివెళ్లకుండా మర్రిగూడ మండలంలోని మాజీ సర్పంచ్‌లతోపాటు పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మర్రిగూడ మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య, చిట్యాల యాదగిరిరెడ్డి, రాములుగౌడ్‌లు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీ దహనం

శాలిగౌరారం: మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీకి బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో ఫ్లెక్సీ పూర్తిగా కాలిపోయింది. ఫ్లెక్సీ కాలిపోయిన విషయాన్ని గురువారం గుర్తించిన స్థానిక నాయకులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఐ ఐలయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన కొంతమంది యువకులు మద్యం మత్తులో ఫ్లెక్సీని దగ్ధం చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

విశ్వకర్మ యోజనపై అవగాహన

మర్రిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజనను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ఆమనగంటి మాలతి అన్నారు. గురువారం రాంరెడ్డిపల్లి గ్రామంలో విశ్వకర్మ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 కులాలకు చెందిన చేతి వృత్తిదారులకు రూ.3లక్షల రుణాన్ని ఎలాంటి పూచీకత్తు లేకుండా కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. వివరాలకు గ్రామపంచాయతీలో లేదా మీ సేవ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

దిష్టిబొమ్మ దహనం

నకిరేకల్: హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో హర్యానాకు చెందిన పోలీసులు జరిపిన కాల్పుల్లో పంజాబ్‌కు చెందిన రైతు మృతి చెందిన ఘటనను నిరసిస్తూ నకిరేకల్‌లో ఎఐకేఎంఎస్, పీవైఎల్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబటి చిరంజీవి, మామిడోజు వెంకటేశ్వర్లు, పసుపులేటి సోమయ్య, చెరుకు సైదులు, అనిల్, బండారి మురళి, నవీన్ పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయండి

చండూరు: మునుగోడు నియోజకవర్గంలో శుక్రవారం జరగనున్న విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోమటి వీరేశం పిలుపునిచ్చారు. గురువారం చండూరు మండల కేంద్రంలో బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 7గంటలకు చండూరు మండల కేంద్రంలోని పద్మావతీ కాలనీలో చేనేత కార్మికుల సదస్సు నిర్వహిస్తామని, అనంతరం బీజేవైఎం కార్యకర్తల బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటపల్లి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. పిన్నింటి నరేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నకిరేకంటి లింగస్వామి గౌడ్, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి పందుల సత్యం గౌడ్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ సమావేశం

నల్లగొండ టూటౌన్: బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి సమావేశం శుక్రవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంట్ ప్రభారి చాడ కిషన్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కేతేపల్లి: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గురువారం జరిగింది. వివరాలు.. కొర్లపహాడ్ గ్రామానికి చెందిన మాదగోని శ్రీనివాస్ కల్లు గీసేందుకు గ్రామ శివారులో ఉన్న తాటిచెట్టు ఎక్కాడు. చెట్టు దిగే క్రమంలో కాలు జారడంతో కిందపడ్డాడు. తీవ్రగాయాలపాలైన శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తీసుకెళ్లారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పి నాగిరెడ్డి

కనగల్: ఉపాధి హామీ సిబ్బంది రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి అన్నారు. కనగల్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై 13వ విడత సామజిక తనిఖీ (ఓపెన్‌ఫోరం) ఎంపీపీ కరీంపాష అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ నాగిరెడ్డి హాజరై మాట్లాడారు. మండల పరిధిలో 2022–23 సంవత్సరం వరకు చేపట్టిన ఉపాధి పనులపై ప్రజావేదిక నిర్వహించారు. ఏడాది కాలానికి గాను మండలంలో 164 పనులు జరిగాయని, కూలీలకు రూ.2.60కోట్లు, మెటీరియల్ రూ.50లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఉపాధి హామీ కూలీల పేర్లను హాజరు పట్టికలో ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జాబ్‌కార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కలను బాధ్యతగా పెంచాలన్నారు. కూలీలకు ఎక్కువగా వేతనం వచ్చే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీ నవీన్, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, అంబుడ్స్‌మెన్ గౌరీ, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి, విజిలెన్స్ అధికారి వేణుగోపాల్ రావు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి గౌతమి, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎస్‌టీఎమ్ అజయ్, ఎస్ఆర్‌పీ ముత్తయ్య, ఏపీఓ సుధాకర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల వార్షికోత్సవం


పానగల్లు శ్రీ మహాలక్ష్మి శ్రీ కనకదుర్గ ఆలయంలో పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


కనగల్ : ఆలయంలో పూజలు చేస్తున్న పిల్లి రామరాజు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పానగల్లు శ్రీ మహాలక్ష్మి శ్రీ కనకదుర్గ దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు శాంతి కల్యాణ మహోత్సవం, వడి బియ్యం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వేడుకల్లో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఆలయ కమిటీ చైర్మన్ బరిగంటి శ్రీను, కమిటీ సభ్యులు శాగంటి లింగయ్య, విజయలక్ష్మి, శాగంటి సహదేవ్, సునీత, శేషుకుమార్, యాదగిరి, హరికృష్ణ, ప్రేమ్‌కుమార్, కట్ట సతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కొమ్మనబోయిన జానయ్య, గజ్జి సురేష్, ఓర్సు రమేష్, తెలుసూరి శివ, జంపాల శంకర్, శశిధర్, ఆలయ ధర్మకర్త చాగంటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్ర, వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు ప్రారంభం

కనగల్: మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామంలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, మూల విగ్రహాలకు అభిషేకం, అఖండ దీపారాధన, వాస్తుహోమలు, అంకురారోపణ, నవగ్రహహోమం, మంగళ నీరాజన మంత్రపుష్పములు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. నేడు జమదగ్ని రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం, 24వ తేదీన రుద్రహోమం, శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం, వీరబ్రహ్మేంద్రస్వామి హోమం, గణపతి హోమం 25వ తేదీన వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం, 26న అగ్నిగుండాలు నిర్వహించనున్నారు.

శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాలు

కనగల్ మండల పరిధిలోని ఎం గౌరారం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు, శ్రీ ఆంజనేయ స్వామి శిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి రామరాజుయాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల ఆర్‌కేఎస్ ఫౌండేషన్ ద్వారా హనుమాన్ గుడికి రేకుల షెడ్డు నిర్మాణం చేయించడంతో రామరాజుకు గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులక్షణశేఖర్‌రావు, ఆలయ చైర్మన్ గోన రవీందర్‌రావు, సింగం నాగరాజు, మెండే చిట్టి, ఐతరాజు రాంబాబు, మండలి మహేష్, వండ్ల శివ, మెండే మధు, గణేశ్, మండలి నాగరాజు, సింగం నాగార్జున, బొమ్మపాల మహేష్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


కనగల్: కురంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


మర్రిగూడ: శివన్నగూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో ..

మర్రిగూడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నీరుడు అంజయ్య, ఉపాధ్యాయులు సుందరయ్య, మంజుశ్రీ, శ్రీధర్, వాసుదేవరావు, ఏడుకొండలు, జీవన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనయ్య, సలీం, శ్రీలత, హైమావతి, సుధారాణి, నాగరాజు, హేమలత, యాదయ్య, ఉపేందర్, సులేమాన్, వెంకటేశ్వర్లు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శివన్నగూడ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పోలె లింగయ్య, ఉపాధ్యాయులు అనురాధ, సైదిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రామకృష్ణ, కోమల్, పార్వతి, రమేష్, శమిబాబు, రవి, సత్తయ్య పాల్గొన్నారు.
కనగల్: మండల పరిధిలోని కురంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురారిశెట్టి రమేష్ ఉపాధ్యాయులు కే పుష్పలత, ఎ హైమావతి సీఆర్‌పీ తిరందాసు సంతోష్‌కుమార్, మంజుల పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంగ్లిష్ పరీక్ష

రామగిరి(నల్లగొండ): సీబీఎస్‌సీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 15 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ తెలిపారు. గురువారం నల్లగొండలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన పరీక్షకు 15 మంది విద్యార్థులకు 15 మంది హాజరయ్యారన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఓక్ ట్రీ స్కూల్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఓక్ ట్రీ పాఠశాల విద్యార్థులు సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి నట్లు పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 25, నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో 22 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం విద్యార్థులను పాఠశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, డైరెక్టర్ గడ్డం మంగారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు అభినందించారు.

న్యూవిజన్ విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్: ఇటీవల ఎస్ఆర్ఎఫ్ శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి మ్యాథ్స్,సైన్స్ ఒలింపియాడ్‌లో నకిరేకల్‌లోని న్యూ విజన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బి.అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. టీ.దీక్షిత(7వ తరగతి) రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంక్, ఎస్‌కె రేహన్ (9వ తరగతి), ఎస్ హర్షశ్రీ (8వ తరగతి), కృత్విక (8వ తరగతి), రుద్రవేణి (8వ తరగతి), తేజశ్రీ (7వ తరగతి), స్నిగ్ధ (6వ తరగతి), సాద్విక్ (6వ తరగతి) వేదితరెడ్డి (5వ తరగతి), హస్వీత (5వ తరగతి), ప్రేజ ప్రియంవద (4వ తరగతి), అక్షితారెడ్డి (4వ తరగతి) జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించారని వివరించారు.


నకిరేకల్ : బహుమతులతో న్యూ విజన్ పాఠశాల విద్యార్థులు

అంతర్జాతీయ కవలల దినోత్సవం


కవలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయిలు

నల్లగొండ టౌన్: పట్టణంలోని న్యూస్ స్కూల్‌లో గురువారం అంతర్జాతీయ కవలల దినత్సోవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవలలను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, గంట్ల పద్మ, ప్రిన్సిపాల్ అలుగుబెల్లి తిరుమల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్పందన, పర్వతరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, లక్ష్మణ్, ఫాతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ దందా


లబ్ధిదారుడు ఇల్లు నిర్మించే ప్రదేశంలో కాకుండా వేరేచోట నిలిపిన ఇసుక ట్రాక్టర్లు


రోడ్డుపై ఇష్టానుసారంగా నిలిపిన ఇసుక ట్రాక్టర్లు

- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న గృహ నిర్మాణదారులకు చేరని ఇసుక
- అధిక డబ్బులు ఇస్తే ఇతరులకు విక్రయం
- పట్టించుకోని అధికారులు

నల్లగొండ రూరల్ : జిల్లా కేంద్రంలో చాప కింద నీరులా ఇసుక దందా జోరుగా సాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్ల యజమానులు ఇంటి నిర్మాణం చేపడుతున్నవారిని తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. నల్లగొండ పట్టణానికి నర్సింగ్‌బట్ల, దోరెపల్లి, కనగల్, పర్వతగిరి, లింగోటం, బుడమర్లపల్లి, తిమ్మన్నగూడెం ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక రవాణా చేస్తారు. లబ్ధిదారుడు ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుంటే నేరుగా ఇల్లు నిర్మాణం చేపడుతున్న ప్రాంతానికి ఇసుక చేరవేయాల్సి ఉంటుంది. అయితే ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులు నల్లగొండ పట్టణంలో తెలిసిన వారి పేరిట ఇసుక బుక్ చేసి గృహాలు నిర్మించుకుంటున్న వారికి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. అసలైన లబ్ధిదారుడికి ఇసుక అందజేయకుండా వైఎస్సార్ సర్కిల్ వద్ద ట్రాక్టర్లను రోడ్డుపై నిలిపి దళారులతో బేరమాడి ఇసుకను చేర్చుతున్నారు. బుక్ చేసిన లబ్ధిదారుడు ఇసుక గురించి అడిగితే దొడ్డుగా ఉందని, మట్టి ఉందని, చౌడు కలిసిందని ఇలా అనేక కారణాలు చెప్పి ఎక్కువ ధర ఇచ్చేవారింటికి ఇసుకను చేర్చుతున్నారు. ఇసుక వద్దని చెప్పిన లబ్ధిదారుడికి ఓటీపీ చెప్పాలని.. డబ్బులు ఫోన్ పే ద్వారా చెల్లిస్తానని చెప్పి బ్లాక్‌లో రూ.3 వేలకుపైగా అమ్ముతున్నారు. ఆన్‌లైన్‌లో ధర అయితే రూ.2670 లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంది. దూరాన్ని బట్టి ధర పెరుగుతుంది.

రోడ్లపైనే అడ్డగోలుగా ట్రాక్టర్ల నిలుపుదల

ఆన్‌లైన్లో ఇసుక బుకింగ్ చేసుకుంటే లబ్ధిదారుడి ఇంటికి ఇసుక చేర్చకుండా దేవరకొండ రోడ్డులోని సర్కిల్, మునుగోడు రోడ్డులోని గుండ్లపల్లి సర్కిల్ వద్ద, జీఎల్ గార్డెన్ రోడ్డుపై ఇసుక ట్రాక్టర్లను అడ్డగోలుగా నిలుపుతున్నారు. దీంతో ఆ దారిగుండా వెళ్లే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇసుక రోడ్డుపై పడడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇసుక ట్రాక్టర్లు రోడ్డుపై గంటల కొద్ది నిలపడంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైనింగ్ అధికారులు, పట్టణ పోలీస్‌ల పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. ఇసుక అధిక ధరకు విక్రయించడంతో సామాన్యుడికి సొంతింటి కల సాకారం కావడం మరింత ఆర్థిక భారంగా మారింది.

రెండు ట్రాక్టర్లుగా మార్చి ..

ఒక్క ట్రాక్టర్‌లో ఇసుకను నిండుగా తెచ్చి చెట్ల పొదల మధ్య, తెలిసిన వారి ఇంటి వద్ద ఇసుకను ట్రాలీ బాడీకి సమాంతరంగా తీసి రెండు ట్రాక్టర్ల ఇసుకగా చేసి విక్రయిస్తున్నారు. ఒక్క ట్రిప్ ఇసుకతో మరో ట్రిప్ ఇసుకను అదనంగా విక్రయిస్తున్నారు. వారం రోజుల క్రితం మైనింగ్ అధికారి ఒకరు గుండ్లపల్లి వద్ద ఆన్‌లైన్ బుకింగ్ లేకుండా వచ్చే ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోగా రూ.10 వేలు ఇస్తే వదిలేసిన వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

లబ్ధిదారునికి చేరే ఇసుకలో కోత..

ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న లబ్ధిదారుడికి 3 క్యూబిక్ మీటర్ల ఇసుక చేరాల్సి ఉండగా రెండున్నర క్యూబిక్ మీటర్లే చేరుతోంది. నగదు 3 క్యూబిక్ మీటర్లకు తీసుకున్నప్పుడు అంతే పరిమాణంలో ఇసుక ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

జరిమానా విధిస్తాం



ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా రోడ్డుపై ఇసుక ట్రాక్టర్లు నిలిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తాం. రోడ్లపై ఇసుక ట్రాక్టర్లు పార్కింగ్ చేయవద్దు.

–డానియల్, ట్రాఫిక్ సీఐ, నల్లగొండ